క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సీతంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ



ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శివకుమార్

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శివకుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఎంతమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు? అధికంగా ఏ రోగాలతో బాధపడుతున్నారు? వారికి అందిస్తున్న చికిత్స తదితర అంశాలపై ఆస్పత్రికి వచ్చిన ఆయన ఆరా తీశారు. మంచి వైద్యసేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, చికిత్స తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రత్నకుమారి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కామాక్షమ్మ ఆలయంలో అన్నసమారాధన



కామాక్షమ్మ ఆలయంలో జరుగుతున్న అన్నసమారాధన

సాలూరు: పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కౌంటింగ్ రోజు నిబంధనలు పాటించాలి

- ఆర్‌ఓ విష్ణుచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న సాలూరు అసెంబ్లీ ఆర్‌ఓ విష్ణుచరణ్

సాలూరు: వచ్చే నెల 4న జరగబోయే ఎన్నికల కౌంటింగ్ రోజున, కౌంటింగ్ ప్రక్రియ నియమనిబంధనలు తప్పక పాటించాలని ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేకాధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు పట్టణంలోని ఆర్‌ఓ కార్యాలయంలో ఎన్నికల్లో పాల్గొన్న రాజకీయపార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజు అనుసరించాల్సిన విధి విధానాలు, కౌంటింగ్ జరిగే తీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు.

ఘనంగా ప్రపంచ హైజనిక్ డే

మక్కువ: మండలంలోని మక్కువ, శంబర గ్రామాలలో ప్రపంచ హైజనిక్ డే ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం ఆవశ్యకతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, లీలావతి మహిళలకు వివరించారు. అలాగే చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఏదైనా ఆహారం తీసుకునే ముందు చేతులు సబ్బు తో శుభ్రం చేసుకోవాలని సూచించారు. అలాగే మలమూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని హితవు పలికారు. చిన్నారులు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మక్కువ, శంబర గ్రామాల్లో ఈ మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సన్నిబాబు, మహిళా పోలీస్ లావణ్య పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఎ.డి ఎం. మధుసూదనరావు ఆధ్వర్యంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎ.డి మధుసూదనరావు మాట్లాడుతూ మండలంలోని 462 మంది రైతులు ముందుగా 86 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను బుక్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు శివరాంపురం గ్రామంలో విత్తనాల పంపిణీ నిర్వహించామని చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలు విత్తిన నాటి నుంచి 35–45 రోజుల మధ్య కాలంలో భూమిని కలియదున్నాలని రైతులకు సూచించారు. వరి విత్తనాలు సాలూరు మండలానికి 1277 క్వింటాళ్లు వచ్చాయిన పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి



జియ్యమ్మవలస పీహెచ్‌సీలో వైద్యులకు సూచనలిస్తున్న జోనల్ మలేరియా అధికారిణి శాంతిప్రభ

జియ్యమ్మవలస: మలేరియా ప్రబలకుండా వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ ఎం.శాంతిప్రభ సూచించారు. మండలంలోని బల్లేరు, తుమ్మిగూడ గ్రామాలను ఆమె మంగళవారం సందర్శించి, దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు, దోమల నివారణ మందు పిచికారీపై ఆరాతీశారు. ప్రతీ ఇంటికి సిబ్బంది వెళ్లి, దోమలు లేకుండా చేసేందుకు చేస్తున్న దోమల మందు స్ప్రేయింగ్‌ను పరిశీలించారు. అలాగే తుమ్మిగూడ గ్రామంలో ఇటీవల నమోదైన మలేరియా కేసు ఆరోగ్య పరిస్థితిని స్వయంగా చూసి, మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. గ్రామీణులకు మలేరియా నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉండాలని సిబ్బందికి తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించి, ఆరోగ్య సమాజానికి కృషి చేయాలని ప్రజలను కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ల్యాబ్ రికార్డులు తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి శంకరరావు, ఏఎంవో సూర్యనారాయణ, సబ్‌యూనిట్ అధికారి నారాయణరావు, ఈవో సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం



ఎండీఎం నిర్వాహకులు చేస్తున్న వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ భాస్కరరావు

భామిని: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా తయారు చేయాలని ఎంఈఓ వి.భాస్కరరావు సూచించారు. భామిని మండల పరిషత్ కార్యాలయంలో ఎండీఎం నిర్వాహకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం రోజువారీ వంటకాలను రుచికరంగా, శుచిగా తయారు చేయాలన్నారు. అనంతరం వివిధ వంటల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ కోఆర్డినేటర్ రామకృష్ణ, సీఆర్‌పీలు ఎస్.చిన్నబాబు, టి.ప్రసాద్, కిశోర్‌కుమార్, సంజీవ్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ దమలపాటి

వీరఘట్టం: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, ఎన్నికల ఫలితాల అనంతరం అభివృద్ధి పనులపై దృష్టి పెడదామని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎటువంటి సమీక్షలు, తీర్మానాలు చేపట్టలేదు. కేవలం 30 నిమిషాల్లోనే సమావేశాన్ని ముగించారు. సమావేశంలో జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు విశ్వాసరాయి భార్గవ్, పత్రి విజయకుమారి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నామావళి సమర్పణ



రామ నామం రాసేందుకు ప్రతులను అందిస్తున్న ఆధ్యాత్మిక గురువులు

పాలకొండ రూరల్: హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ నామావళి సమర్పణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఆధ్యాత్మిక గురువు చింతా భాస్కరనాయుడు నేతృత్వంలో ఒక్కో భక్తుడు 108 రామ నామాలను అక్షర రూపంలో రాసే విధంగా అవసరమగు ప్రతులు భక్తులకు అందజేశారు. కొండాపురం, ఎన్‌కె.రాజపురం, బుక్కూరు తదితర గ్రామంలో భక్తులకు వాటిని మంగళవారం పంపిణీ చేశారు. అన్ని గ్రామాల్లో వీటిని అందజేస్తామన్నారు. భక్తులతో రామకోటి రాసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు జనార్దనరావు, తదితరులు శ్రీరాముని దివ్య గాథను భక్తులకు వినిపించారు.

చేతి వేళ్ల ప్రాధాన్యం తెలుసుకో..



విద్యార్థులతో శ్లోకాలు పాడిస్తున్న జనార్దనరావు

పాలకొండ రూరల్: మనిషి తన చేతికి ఉన్న ఐదు వేళ్ల ప్రాధాన్యత తెలుసుకోవాలని యోగా శిక్షకుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.జనార్దనరావు అన్నారు. పాలకొండ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. యోగా, చేతి వేళ్ల విశిష్టతను వివరించారు. చిటికెన వేలు ఆటలకు, ఉంగరపు వేలు పాటలకు, మధ్య వేలు చదువుకు, చూపుడు వేలు పనులకు, బొటన వేలు ధ్యానంనకు ప్రతీకలన్నారు. ప్రతీ విద్యార్థి వీటిని అనుసరించి ఆయా రంగాల్లో సాధన చేస్తే ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుంటారని తెలిపారు. తెలుగు శ్లోకాల విశిష్టతను వివరించారు. అనంతరం గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రపై అవగాహన కల్పించారు.

కౌంటింగ్‌కు నేతలు సహకరించాలి: ఆర్‌ఓ



సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌ఓ శుభం బన్సల్

పాలకొండ: కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు సహకరించనట్లే కౌంటింగ్‌కు కూడా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. జూన్ 4న నిర్వహించే కౌంటింగ్ కోసం పార్టీలు ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. నిబంధనల మేరకు ఏజెంట్లు వ్యవహరించాలని కోరారు. ఆయనతో పాటు తహసీల్దార్ వరహాలు ఉన్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి



పనుకువలస సమీపంలో 7వ బ్రాంచ్ కాలువకు పడిన గండి

పాలకొండ రూరల్: రానున్న వర్షాకాలంలో సాగునీటి కాలువలకు గండ్లు పడే అవకాశం ఉందని, ఇరిగేషన్ విభాగం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని రైతు సంఘాల ప్రతినిధి వంజరాపు కొండలరావు అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో తోటపల్లి 7వ బ్రాంచ్ పరిధిలో పనుకువలస సమీపంలో ఉన్న కాలువకు ఇప్పటికే గండి పడిందన్నారు. అధికారులు స్పందించకుంటే వర్షాలు అధికమైనప్పుడు ఈ సమస్య మరింత జటిలమై పంటలు నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ఇరిగేషన్ అధికారులు కాలువల తాజా స్థితిగతులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బహిరంగ మద్యపానం నిషేధం

పాలకొండ రూరల్: బహిరంగ మద్యపానం నిషేధమని, చట్టరీత్యా నేరమని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. మంగళవారం తన సిబ్బందితో కలిసి పాలకొండ–సీతంపేట, వీరఘట్టం, విశాఖ రహదారుల్లో గల ఖాళీ ప్రదేశాలు, కల్వర్టు ఖానాలు, శివారు ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్సు లేకుండా వాహనాలు నడిపేవారిని గుర్తించి వారిపై అపరాధ రుసుం విధించారు.

పరామర్శ



వెంకటరాజపురంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడులో సీరస శంకరరావు, వెంకటరాజపురంలో బంటు లక్ష్మిలు కుక్కల దాడిలో ఇటీవల మృతి చెందగా, ఆయా గ్రామాలకు సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మంగళవారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపి, బాధిత కుటుంబాలను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పరిశీలన



విద్యాకానుక కిట్‌లను పరిశీలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

సీతానగరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించడానికి వీలుగా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేయడానికి విద్యాకానుక కిట్లు సిద్ధం చేస్తున్నామని డీఈఓ జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె సీతానగరం మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకున్న విద్యాకానుక కిట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు వసరమైన విద్యాకానుక కిట్లు దశలవారీగా వస్తున్నాయన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ఎంఈఓ -1, 2లు సూరిదేముడు, వెంకటరమణలు సమన్వయం చేసుకుని ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

11వేల మందికి 'ఉపాధి'



పణుకుపేట చెరువు వద్ద వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఏపీఓ భాను

సీతానగరం: ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని 11వేల 846 మంది వేతనదారులకు మంగళవారం పనులు కల్పించామని ఏపీఓ భాను అన్నారు. ఈ మేరకు పణుకుపేట, కాశీపేట, తామరఖండి గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న చెరువుల్లో వేతనదారుల మస్తరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులు గుర్తించిన చెరువుల్లో వేతనదారులు పనిచేయడానికి ముందుగా టెక్నికల్ సహాయకులు మార్కింగ్ ఇవ్వాలని, నిర్దేశించిన మార్కింగ్‌కు లోబడి వేతనదారులు పనులు చేయాల్సి ఉంటుందన్నారు.అలాగే పనిచేస్తున్న విస్తీర్ణాన్ని మేట్‌లు దగ్గరుండి కొలత వేయించుకోవాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించనున్నట్లు చెప్పారు. ఒక్కోరోజు ఒక్కోవిధంగా వేతనదారులు పనుల్లో పాల్గొంటుండగా మంగళవారం 35 గ్రామ పంచాయతీలలో గుర్తించిన 75 చోట్ల 11.846 మంది వేతన దారులు పనుల్లో పాల్గొన్నారని తెలియజేశారు. వలసలు నిరోధించడానికి అర్హులైన వారందరికీ ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డులు మంజూరుచేసి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తామరఖండి పంచాయతీ రేపటివలసలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ సహాయకురాలు దేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొలతలను పరిశీలించారు. కార్యక్రమంలో జేఈ కృష్ణ, టెక్నికల్ సహాయకులు, ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న వీఏఏలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామ రైతు భరోసా కేంద్రంలో 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం పచ్చిరొట్ట విత్తనాలు ఎలా వేసుకోవాలి, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వీఏఏ కె.విజయ్ రైతులకు వివరించారు. ప్రధాన పంటను సాగు చేసుకోవడానికి ముందు ఈ పచ్చిరొట్ట విత్తనాలు పొలాల్లో వేసుకోవాలని, అవి మొక్కలైన తర్వాత అదే నేలలో కలియదున్నుకోవాలని తెలిపారు. ఇలా చేయడం ద్వారా నేలసారవంతమై ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు నేలద్వారా సమకూరుతాయన్నారు. పంట కూడా చీడపీడల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు చేతికి వస్తాయన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది

కురుపాం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భవాని, జానకి, విజయగౌరి, గౌరమ్మ, శ్రావణిలు కోరారు. వరల్డ్ మెన్‌స్ట్రువల్ హైజీన్ డే(ప్రపంచ రుతు పరిశుభ్రతా దినోత్సవం) సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీరియడ్స్ సమయంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన పరిశుభ్రతా చర్యలను సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో బ్లాక్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆర్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: వంబరెల్లి లోయలో సోమవారం ఆటో బోల్తాపడిన సంఘటనలో గాయపడి రిమ్స్, విశాఖపట్నం కేజీహెచ్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరామర్శించారు. రిమ్స్‌లో 11 మంది క్షతగాత్రులు చికిత్స పొందుతుండగా.. వారి వద్దకు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌లో అత్యవసర చికిత్స పొందుతున్న సవర లక్ష్మి, అనిత, బుద్దులను పరామర్శించారు. క్షతగాత్రులంతా త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మ తల్లికి సమర్పించిన ప్రసాదాలు

భామిని: మండలంలోని దిమ్మిడిజోలలో కొలువుతీరిన పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి విశేష నైవేద్యాలను సమర్పించారు. దేవతా ఘటాలను కొలువుదీర్చారు. మంటపం వద్ద ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కోరిన కోర్కెలు తీర్చే పెద్దమ్మతల్లిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలతో మహిళలు

భామిని: మండలంలోని దిమ్మిడిజోలలో పెద్దమ్మతల్లి సంబరాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు వేడుకలో భాగంగా మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఎక్కోడు పూజలతో ప్రారంభించి గ్రామంలోని అన్ని వీధుల్లో ముఠ్రాటలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

ఇంటి వద్దకే రేషన్ సరుకులు



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

భామిని: జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ లబ్ధిదారులకు విధిగా ఇంటింటి వద్దనే రేషన్ అందివ్వాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని రేషన్ డీలర్లతో మంగళవారం సమావేశమై రేషన్ సరుకుల పంపిణీపై సమీక్షించారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం పూటే సరుకుల పంపిణీని ప్రారంభించాలని సూచించారు. రేషన్ వాహనాలను సిద్ధం చేసి సరుకులు సక్రమంగా అందివ్వాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, డీలర్లు ఉన్నారు.

ఉక్కపోతతో విలవిల



జనసంచారం లేక బోసిపోయిన భామిని ప్రధాన రహదారి

భామిని: రోహిణి కార్తి ప్రవేశంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతల్లో తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి.

ఎండలతో పాటు వేడి గాలులు, ఉక్కపోత తోడవ్వటంతో ప్రజలు విలవిలాడిపోతున్నారు. మంగళవారం మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి రోడ్లపై జనసంచారం లేకపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

90 శాతం రాయితీ ఇవ్వాలి

పాలకొండ రూరల్: జిల్లా భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని, అధిక దిగుబడులు ఇచ్చే సంపద, అమూల్య, అజయ్ తదితర వరి వంగడాలను, వ్యవసాయ యంత్ర పరికరాలను 90 శాతం రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు గురుబిల్లి అప్పలనాయుడు, కిమిడి రామూర్తినాయుడు తదితరులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,67,864 ఎకరాల్లో వరి సేద్యానికి సంబంధించి 5035.92 మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరమన్నారు. ఈ క్రమంలో 2,410 మెట్రిక్ టన్నుల విత్తనాలు 47 శాతం రాయితీపై అధికారులు అందించేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రైతులు విత్తనాలు స్వయంగా తయారు చేసేవారిని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ క్రమంలో అధికారులు రైతుల అవసరాలకు తగిన విధంగా విత్తనాలు, నీటి ఇంజిన్లు, స్ప్రింకర్లు, ఆధునిక యంత్రాలను 90 శాతం రాయితీపై అందించాలని కోరారు.